# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 119 | గురువారం 01, జనవరి 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




## ఈరోజు ఫెయిల్ అవండి!

ఇదే నూతన సంవత్సర చివరి సందేశం అంటూ సజ్జనార్ ఆసక్తికర ట్వీట్

ఎవరూ మద్యం తాగి వాహనం నడపవద్దని సూచన

పరీక్షలలో 35 మార్కులు వస్తే గట్టెక్కినట్లేనని వ్యాఖ్య

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మాత్రం ఔట్ అయినట్లేనని వెల్లడి

02



## తాగి తూలేవారిని ఇంటివద్ద దిగబెడతాం

ప్రజల భద్రతే మా లక్ష్యం

మత్తు దిగే వరకు భద్రంగా ఉంచుతాం

మహిళల భద్రత ఎంతో ముఖ్యం

కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర

02


# కరోనాకు ఆరేళ్లు

## సరిగ్గా ఇదే రోజు కోవిడ్ మహమ్మారి ఎంట్రీ

సరిగ్గా ఆరేళ్ల క్రితం కోవిడ్19 ఎంట్రీ..

చైనా వూహాన్ నగరంలో మొదటగా కేసులు..

2020 మార్చి నాటికి ప్రపంచంలో చాలా దేశాల్లో లాక్‌డౌన్..




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
ఆరేళ్ల క్రితం ఇదే రోజు అంటే, డిసెంబర్ 31, 2019 ప్రపంచమంతా "న్యూ ఇయర్" వేడుకలకు సిద్ధమవుతోంది. ప్రజలంతా కొత్త ఏడాదిని స్వాగతించేందుకు ఎదురుచూస్తున్నారు. కానీ అదే సమయంలో ఒక మహమ్మారి పురుడుపోసుకుంది. అదే "కోవిడ్19". మానవ చరిత్రలో ఆధునిక కాలంలో మనిషి ఎప్పుడూ చూడని ప్రళయాన్ని సృష్టించింది. ప్రజలందర్నీ కేవలం ఇళ్లకే పరిమితం చేసింది. "లాక్‌డౌన్"తో జనజీవితం అస్తవ్యస్తమైంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది కరోనా మహమ్మారికి బలయ్యారు.

**కరోనాకు కేంద్రంగా వూహాన్:**
ఈ మొత్తం కరోనాకు చైనాలోని వూహాన్ నగరం కేంద్రంగా మారింది. చైనాలోని ఆరోగ్య నిపుణులు కొత్తగా నమోదైన కేసును మొదటగా "న్యూమోనియా" గా భావించారు. కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం, లక్షణాల తీవ్రంగా ఉండటంతో అత్యవసర హెచ్చరిక జారీ చేశారు. ఇది నెమ్మదిగా చైనా నుంచి ప్రపంచంలోని మిగతా దేశాలకు వ్యాప్తించింది. పలు దేశాల ఆర్థిక వ్యవస్థల్ని, ఆరోగ్య వ్యవస్థల్ని చిన్నాభిన్నం చేసింది.వూహాన్‌లోని ఫిష్ మార్కెట్‌లో మొదటగా ఈ కోవిడ్19

మిగతా 2లో..

## కరీంనగర్ మేయర్ పీఠం మాదే

కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ సహా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీల్లో బీజేపీ జెండా ఎగరేయడమే లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని

మిగతా 2లో..




## ప్రజాస్వరం పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నూతన సంవత్సరం 2026 సందర్భంగా మా ప్రియతమ పాఠకులకు, శ్రేయోభిలాషులకు మరియు ప్రకటనకర్తలకు 'ప్రజాస్వరం' దినపత్రిక యాజమాన్యం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ కొత్త ఏడాది మీ అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు, విజయాలు నింపాలని మనసారా ఆకాంక్షిస్తున్నాము.నూతన సంవత్సర శుభాకాంక్షలు! -యాజమాన్యం



# కమిషన్ల కోసమే బిల్లుల నిలిపివేతా?

చిన్న కాంట్రాక్టర్ల పొట్ట కొడుతున్న కాంగ్రెస్ సర్కార్

'మన ఊరు మన బడి' బిల్లులు వెంటనే చెల్లించాలి

రూ.512 కోట్ల పెండింగ్ బిల్లులకై కాంట్రాక్టర్ల పోరు

కమిషన్ల కోసమే బడా కాంట్రాక్టర్లకే బిల్లులా?

అసెంబ్లీలో పోరాడుతామని హరీశ్ రావు భరోసా

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కమిషన్ల కోసం బడా కాంట్రాక్టర్ల బిల్లులను చకచకా విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, చిన్న కాంట్రాక్టర్ల సమస్యలు కనిపించడం లేదా? అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 'కమిషన్లు రావు అన్న ఉద్దేశంతోనే బిల్లులు ఆపేస్తున్నారా?' అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. బుధవారం హైదరాబాద్‌లో 'మన ఊరుమన బడి' కాంట్రాక్టర్లు హరీశ్ రావును కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అప్పులు తెచ్చి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు**
ఈ సందర్భంగా మాజీ మంత్రి

మిగతా 2లో..



# క్లీన్ హైదరాబాదే మా లక్ష్యం

పరిశుభ్రమైన నగరాన్ని నిర్మిస్తాం

స్వచ్ఛ సర్వేక్షణ్ లో హైదరాబాద్ టాప్

వచ్చే ఏడాది మూడు వేల కోట్ల ఆస్తి పన్నులు వసూలు చేస్తాం

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
హైదరాబాద్ మహానగరాన్ని పరిశుభ్రతలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా 2026లో పనిచేయనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రకటించారు. ఇటీవల ప్రకటించిన 2025 స్వచ్ఛ సర్వేక్షణ్ (స్వచ్ఛ సుర్వేక్షణ్) ఫలితాల్లో హైదరాబాద్ జాతీయ స్థాయిలో ఆరో ర్యాంకును సాధించిందని, ఇది 4,500కు పైగా నగరాల్లో దేశవ్యాప్తంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ర్యాంకింగ్‌లో హైదరాబాద్ 'సెవెన్ స్టార్' రేటింగ్‌ను కూడా పొందిందని, ముఖ్యంగా చెత్త నిర్వహణ, పారిశుద్ధ్యం, పౌరుల భాగస్వామ్యం వంటి అంశాల్లో 100 శాతం స్కోర్ సాధించిందని కర్ణన్ తెలిపారు. ఈ సాఫల్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, డిసెంబర్ 29 నుంచి జనవరి 31, 2026 వరకు నగరవ్యాప్తంగా 300 వార్డుల్లో మెగా సానిటేషన్ డ్రైవ్ చేపట్టనున్నట్లు

మిగతా 3లో..



## హరీశ్ చెప్పేవన్నీ అబద్ధాలే..

02

కృష్ణా జలాలపై సెంటిమెంట్ రగిల్చే కుట్ర

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్

ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ చారిత్రక తప్పిదాలు

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

# ఎస్ఎస్ 3 విజయవంతం

ఇస్రో పరిశోధనల్లో మరో కీలక ముందడుగు

వాణిజ్య ప్రయోగాలకు అనువుగా ప్రయోగం

చిన్న ఉప గ్రహాల మార్కెట్ లో భారత్ కు డిమాండ్



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో కీలక ముందడుగు వేసింది. చిన్న ఉపగ్రహాల ప్రయోగాల కోసం రూపొందిస్తున్న స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) కార్యక్రమంలో భాగంగా, మూడో దశ అయిన ఎస్ఎస్-3 (ఎస్ఎస్ 3)ను విజయవంతంగా పరీక్షించింది. ఈ స్టాటిక్ ఫైర్ టెస్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్డీఎస్సీ)లో ఉన్న సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ కేంద్రంలో మంగళవారం నిర్వహించింది. మూడు దశలతో కూడిన ఆల్-సాలిడ్ లాంచ్ వెహికల్ అయిన SSLV పనితీరును సమగ్రంగా విశ్లేషించడంతో పాటు, కీలక సాంకేతిక డేటాను ఈ పరీక్షలో సేకరించినట్లు ఇస్రో వెల్లడించింది. భవిష్యత్తులో చిన్న ఉపగ్రహాలను తక్కువ

మిగతా 3లో..



## కొత్త సంవత్సరం వేళ భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

150 కిలోల అమ్మోనియం నైట్రేట్ సీజ్

యూరియా సంచుల్లో దాచి తరలింపు

నిఘావర్గాల సమాచారంతో పోలీసుల తనిఖీలు

ఈ ఘటన వెనుక ఉగ్ర కుట్ర ఉందా?

02

# యూట్యూబర్ అన్వేష్‌పై కేసులు

వివాదాస్పద వ్యాఖ్యలు, ఫిర్యాదుల వివరాలు

అన్వేష్ కామెంట్లపై చెలరేగిన దుమారం

హిందూ సంఘాల నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత

తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల కేసులు నమోదు


హిందు దేవతలను కించపరిచిన అన్వేష్

లక్షల్లో అన్ ఫాలో అవుతున్న నెటిజన్లు

అన్వేష్ క్షమాపణ చెప్పినా ఆగని దుమారం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
హైదరాబాద్‌లోని ప్రముఖ టాలీవుడ్ వ్యక్తి మరియు సినీనటి కరాటే కల్యాణి, ప్రముఖ ట్రావెల్ యూట్యూబర్ అన్వేష్ (నా అన్వేషణ ఛానల్ నిర్వాహకుడు) పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో అన్వేష్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు మరియు అభ్యంతరకరమైన కంటెంట్ ప్రచారం చేశాడని ఆమె ఆరోపించారు. దీంతో

మిగతా 3లో..




# ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోండి




మున్సిపాలిటీలను ఎందుకు విలీనం చేశారు

పేరుకు ప్రజాపాలన.. చేసేది రాచరిక పాలన

హైదరాబాద్‌పై అజారుద్దీన్‌కు అవగాహన లేదు

సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆగ్రహం

02

# తాగి తూలేవారిని ఇంటివద్ద దిగబెడతాం



- కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర

హైదరాబాద్, (ప్రజాస్వరం):

నూతన సంవత్సర వేడుకల్లో మితిమీరి మద్యం సేవించిన వారివల్ల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూసేందుకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం మత్తులో ఉన్న వారిని వారి ఇళ్ల దగ్గరే సురక్షితంగా దింపే బాధ్యతను బెంగళూరు పోలీసులు తీసుకుంటారని కర్ణాటక రాష్ట్ర హోంమంత్రి జి. పరమేశ్వర వెల్లడించారు. అయితే ప్రతి ఒక్కరిని నేరుగా ఇంటివద్ద దించటం సాధ్యం కాదని పేర్కొన్న ఆయన.. మత్తు పూర్తిగా దిగేవరకు వారిని ఉంచేందుకు నగరంలో 15 ప్రత్యేక ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించడం, మహిళలను వేధించడం లేదా ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన వారిపై మాత్రం కఠిన చర్యలు తప్పవని హోంమంత్రి హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బార్లు, పబ్‌లలో జరుగుతున్న ఏర్పాట్లను పోలీసులు నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ''కొన్ని జిల్లాల్లో పెద్దగా సమస్య ఉండదు. అయితే బెంగళూరు, మైసూర్, హుబ్బళి, బెలగావి, మంగళూరు వంటి రద్దీ ఎక్కువగా ఉండే నగరాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టాం'' అని ఆయన వివరించారు. ఇదే విషయంపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ భద్రతా ఏర్పాట్లపై అప్‌డేట్ ఇచ్చారు. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో బెంగళూరు నగరం వ్యాప్తంగా సుమారు 20 వేల మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. ఇందులో ప్రత్యేక శిక్షణ పొందిన మహిళా పోలీసు బృందాలు కూడా ఉన్నాయని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఇదిలా ఉండగా, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం సేవించిన వారికి ఉచిత రవాణా సేవలు అందించనున్నట్లు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యూయూ) ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సేవల కోసం క్యాబ్‌లు, ఆటోలు, ఈవీ బైక్‌లు కలిపి మొత్తం 500 వాహనాలను సిద్ధం చేసినట్లు యూనియన్ పేర్కొంది. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకే ఈ ఉచిత రవాణా సేవలు అందిస్తున్నట్లు వెల్లడించింది.

# ఈరోజు ఫెయిల్ అవండి!



- ఇదే నూతన సంవత్సర చివరి సందేశం అంటూ సజ్జనార్ ఆసక్తికర ట్వీట్
- ఎవరూ మద్యం తాగి వాహనం నడపవద్దని సూచన
- పరీక్షలలో 35 మార్కులు వస్తే గట్టెక్కినట్లేనని వ్యాఖ్య
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మాత్రం ఔట్ అయినట్లేనని వెల్లడి

హైదరాబాద్, (ప్రజాస్వరం):

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా ఒక ట్వీట్ చేశారు. "నూతన సంవత్సర వేడుకలకు ఇది నా చివరి సందేశం" అంటూ ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈరోజు ఫెయిల్ కావడానికి ప్రయత్నించండని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ మీరు పాస్ అయితే చంచల్‌గూడ జైలుకు పంపించబడతారని, అక్కడ ఉచిత భోజనం ఉంటుందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. విద్యా పరీక్షలలో 35 మార్కులు వస్తే ఉత్తీర్ణులైనట్లేనని, కానీ డ్రంక్ అండ్ డ్రైవ్ మీటర్‌లో 35 (బీఏసీ) దాటితే మాత్రం అనర్హులవుతారని ఆయన పేర్కొన్నారు. పరీక్షలలో ఫెయిలైతే ఏడాది మాత్రమే నష్టపోతామని, కానీ రోడ్డు మీద తేడా కొడితే జీవితం ఆగమవుతుందని ఆయన సున్నితంగా హెచ్చరించారు. అందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మన రోడ్లు రక్తసిక్తం కావడానికి తాము అంగీకరించేది లేదని ఆయన తేల్చి చెప్పారు. యువత బాధ్యత కంటే మద్యం ఎక్కువ అని భావిస్తే, చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన అన్నారు. నూతన సంవత్సర బహుమతిగా ఆసుపత్రి బిల్లులు చెల్లించడం లేదా ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడం కాకుండా, సురక్షితంగా ఇంటికి వెళ్లడం మంచిదని ఆయన సూచించారు. తాగి వాహనం నడపడాన్ని హైదరాబాద్ పోలీసులు ఏమాత్రం సహించరని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోండి

- మున్సిపాలిటీలను ఎందుకు విలీనం చేశారు
- పేరుకు ప్రజాపాలన.. చేసేది రాచరిక పాలన
- హైదరాబాద్‌పై అజారుద్దీన్‌కు అవగాహన లేదు
- సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆగ్రహం

హైదరాబాద్, (ప్రజాస్వరం):

ప్రజలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకోకుండా శివారు మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద గౌడ్, కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ సర్కార్ హైదరాబాద్ నగరాన్ని చిన్నచూపు చూస్తున్నదన్నారు. తన ఊహల నగరం ఫోర్త్ సిటీ అంటూ సర్కార్ ఊహల్లో ఉన్నదన్నారు. రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు మెట్రోను రద్దు చేశారని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన పేరుతో ఎక్కడ పడితే అక్కడ కూల్చివేతలకు పాల్పడిందన్నారు. నగరంలో కాలుష్యం లేకుండా ఫార్మా సిటీ కట్టాలని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే దాన్ని కాంగ్రెస్ సర్కార్ రద్దు చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు రాలేదన్నారు. హైదరాబాద్ నగరం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలని కోరితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అజారుద్దీన్‌ను మంత్రిని చేశారని, ఆయనకు హైదరాబాద్ నగరంపై పూర్తి స్థాయిలో అవగాహన లేదన్నారు. హైదరాబాద్ నగరం తెలంగాణకు గుండెకాయ, ఆర్థిక అభివృద్ధికి గ్రోత్ ఇంజన్ అన్నారు. మహేశ్వరం, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న గ్రామాలను కార్పొరేషన్‌లో కలిపి వారికి అన్యాయం చేస్తున్నారన్నారు. పేరుకు ప్రజా పాలన చేసేది రాచరిక పాలన అని ఆరోపించారు. 27 శివారు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేశారన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకోకుండా శివారు మున్సిపాలిటీలను విలీనం చేశారని, మంత్రులు, అధికారులు, మేయర్‌కు తెలియకుండా జీహెచ్ఎంసీలో 300 డివిజన్లు చేశారన్నారు. రేవంత్ రెడ్డి నియంతృత్వ పాలన చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో జీహెచ్ఎంసీకి 30 అవార్డులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వచ్చాయన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచ గ్రీన్ సిటీ అవార్డు బీఆర్ఎస్ హయాంలో వచ్చిందన్నారు. స్వచ్ఛ ఎక్సలెన్స్ అవార్డ్ వచ్చిందన్నారు. పార్టీ నిర్ణయాలను కాంగ్రెస్ కార్పొరేటర్లు, నేతలే వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో చాలా ప్రజా సమస్యలు వున్నాయన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఈ సంవత్సరం 16 రోజులు మాత్రమే నడిచిందన్నారు. స్పీకర్ ఇటీవల ఇంగ్లండ్ వెళ్లి వచ్చారని, అక్కడ పార్లమెంట్ సంవత్సరంలో 160 రోజులు జరుగుతుందని, అసెంబ్లీలో జీరో అవర్ జీరో ఆన్సర్‌గా మారిందన్నారు. అసెంబ్లీలో వ్యక్తిగత దూషణలు, బూతులు ఎక్కువ అయ్యాయని, స్పీకర్‌కు అసెంబ్లీని ఎక్కువ రోజులు నడపాలని ఉన్నా ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. అసెంబ్లీ శీతాకాల సెషన్స్ ఎక్కువ రోజులు నడపాలని కోరారు. రాష్ట్రంలో హాస్పిటల్స్ పరిస్థితి దారుణంగా ఉందని ఆరోపించారు. అసెంబ్లీని ప్రభుత్వం హుందాగా నడపాలని, అసెంబ్లీలో వ్యక్తిగత విమర్శలు లేకుండా చూడాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎవరైనా వ్యక్తిగత విమర్శలు చేస్తే అడ్డుకోండి అని సూచించారు.




# కమిషన్ల కోసమే బిల్లుల నిలిపివేతా?

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న కేసీఆర్ లక్ష్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 512 కోట్ల బిల్లులు 'రెడీ ఫర్ పేమెంట్' ఉన్నప్పటికీ ప్రభుత్వం చెల్లించడం లేదని ధ్వజమెత్తారు. ఒకవైపు బ్యాంకు వడ్డీలు, మరోవైపు కార్మికుల జీతాలు చెల్లించలేక కాంట్రాక్టర్లు ఆత్మహత్యల దిశగా వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులాల పిల్లలకు సరిగ్గా అన్నం కూడా పెట్టలేని చేతగాని సర్కారు అని తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టర్ల బకాయిలను విడుదల చేయాలని హరీశ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, కాంట్రాక్టర్లకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని ఆయన భరోసా ఇచ్చారు. అభివృద్ధి పనులు చేసిన వారికి సకాలంలో చెల్లింపులు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మాజీ మంత్రి దుయ్యబట్టారు.




# కరోనాకు ఆరేళ్లు..

మొదటిపేజీ తరువాయి

కేసుల్ని గుర్తించారు. ఇది మహాసముద్రాలు దాటి యూరప్, అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని ఇతర దేశాలకు చేరింది. 21వ శతాబ్దపు అత్యంత వినాశకరమైన మహమ్మారిగా మారింది. మార్చి 2020 నాటికి, వేగంగా వ్యాప్తి చెందుతున్న వైరస్‌ను అరికట్టడానికి దేశాలు తమ సరిహద్దుల్ని మూసేశాయి. నగరాలను స్మశానాలను తలపించేలా "లాక్‌డౌన్" పరిస్థితిలోకి వెళ్లాయి. అధికారికంగా కోవిడ్19 వల్ల ప్రపంచ వ్యాప్తంగా 7 మిలియన్ల మంది ప్రాణాలు వదిలారు. మహామాంద్యం తర్వాత ఎప్పుడూ చూడని విధంగా పలు దేశాలు ఆర్థిక వ్యవస్థలు కుచించుకుపోయాయి.

**భారత్‌లో లాక్‌డౌన్:**

కోవిడ్19ను అరికట్టడానికి భారత్ మార్చి 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించింది. ముందుగానే వినాశనాన్ని గుర్తించిన కేంద్రం.. ఆస్పత్రులు, పరీక్షలు, ఆక్సిజన్ సరఫరా సప్లై చైన్‌ను బలోపేతం చేయడానికి సమయాన్ని సంపాదించుకుంది. కానీ, కోవిడ్19 డెల్టా వేరియంట్ వారాల్లోనే లక్షలాది మందిని చంపింది. అయినప్పటికీ, భారత్ ఒక ఏడాది లోపే వ్యాక్సిన్‌ను తయారు చేసుకోగలిగింది. భారత్ బయోటెక్ కోవాక్సిన్, సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కోవిషీల్డ్‌ను భారీగా ఉత్పత్తి చేసింది. లక్షలాది మంది మరణాలను అడ్డుకునేందుకు సహాయపడ్డాయి. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆరేళ్ల క్రితం వూహాన్ నుంచి వచ్చిన ఈ కరోనా వైరస్, ప్రపంచ దేశాలకు ఆరోగ్య అత్యవసర స్థితికి ఎలా సన్నద్ధమవ్వాలో నేర్పించింది.



# కొత్త సంవత్సరం వేళ భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

- 150 కిలోల అమ్మోనియం నైట్రేట్ సీజ్
- నిఘావర్గాల సమాచారంతో పోలీసుల తనిఖీలు
- ఈ ఘటన వెనుక ఉగ్ర కుట్ర ఉందా?

హైదరాబాద్, (ప్రజాస్వరం):

నూతన సంవత్సర వేళ రాజస్థాన్ రాష్ట్రంలోని టోంక్ జిల్లాలో పోలీసులు పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న ఘటన కలకలం రేపింది. ఈ ఘటన నూతన సంవత్సర పండుగ సమయంలో జరగడంతో సెక్యూరిటీ ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. పోలీసులు ఒక కారును అడ్డుకుని తనిఖీ చేయగా, అందులో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్, 200 ఎక్స్‌ప్లోసివ్ క్యాట్రిడ్జ్‌లు, మరియు 6 కట్టల సేఫ్టీ ఫ్యూజ్ వైర్ (సుమారు 1,100 మీటర్లు) లభ్యమయ్యాయి. ఈ పదార్థాలను యూరియా సంచుల్లో దాచి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ స్వాధీనం టోంక్‌జైపూర్ హైవే పై బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులకు నిఘా వర్గాల నుంచి ముందస్తు సమాచారం అందడంతో డిస్ట్రిక్ట్ స్పెషల్ టీమ్ (డీఎస్టీ) ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. కారును అడ్డుకుని తనిఖీ చేయగా, ఈ పేలుడు పదార్థాలు బయటపడ్డాయి. వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని బూందీ జిల్లాకు చెందిన సురేంద్ర పట్వా (48 సంవత్సరాలు, భన్వర్‌లాల్ కుమారుడు) మరియు సురేంద్ర మోచీ (35 సంవత్సరాలు)గా గుర్తించారు. ఇద్దరూ బూందీ జిల్లాలోని కర్వార్ నివాసులు. ఈ పదార్థాలను బూందీ నుంచి టోంక్‌కు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. పేలుడు పదార్థాల సోర్స్ ఏమిటి? వీటిని ఎక్కడి నుంచి సేకరించారు? ఉద్దేశ్యం ఏమిటి? చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఉపయోగించాలనుకున్నారా? అనే అంశాలపై దృష్టి సారించారు. నూతన సంవత్సర వేళ ఈ స్వాధీనం జరగడంతో, సంభావ్య టెర్రర్ లింక్స్ లేదా సబోటేజ్ అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు. రాజస్థాన్‌లో ఇటీవల కాలంలో ఇలాంటి పేలుడు పదార్థాల స్వాధీన ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, ఇది మరింత ఆందోళన కలిగిస్తోంది. ఉదాహరణకు, డిసెంబర్ మొదటి వారంలో నాథ్‌ద్వారాలో కూడా పెద్ద ఎత్తున ఎక్స్‌ప్లోసివ్స్ స్వాధీనం జరిగింది, అది 10 కిలోమీటర్ల పరిధిలో నాశనం చేసే సామర్థ్యం కలిగినది. పోలీసులు ఈ ప్రాంతాన్ని కార్డన్ చేసి, మరిన్ని తనిఖీలు చేపట్టారు. ఈ ఘటన రాష్ట్రంలో సెక్యూరిటీని మరింత బిగుతు చేసేలా చేసింది, ముఖ్యంగా పండుగ సమయంలో ప్రజల భద్రతను కాపాడటానికి అదనపు చర్యలు తీసుకుంటున్నారు. నిందితులపై ఎక్స్‌ప్లోసివ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, విచారణ కొనసాగుతోంది.



# కరీంనగర్ మేయర్ పీఠం మాదే

మొదటిపేజీ తరువాయి

తప్పకుండా కైవసం చేసుకుంటామని మా వ్యక్తం చేశారు. ఇవాళ పట్టణంలోని త్రిధా హోటల్‌లో కరీంనగర్ కార్పొరేషన్‌తో పాటు హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లోని పట్టణ, జోన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. టికెట్ల విషయంలో పైరవీలు, మొహమాటాలకు తావు లేదని తేల్చి చెప్పారు. సర్వే రిపోర్టుల ఆధారంగా గెలుపు అవకాశం ఉన్న వారికే పార్టీ టికెట్లు కేటాయిస్తుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ కోసం తనకు లేదా కుటుంబ సభ్యులకు ఫోన్లు చేయవద్దని.. ఒత్తిడి తెస్తే టికెట్లు రావని బండి సంజయ్ హెచ్చరించారు. టికెట్ రాని వారికి పార్టీ లేదా నామినేటెడ్ పదవుల్లో సర్దుబాటు చేస్తామని, ఎక్కువ నామినేటెడ్ పోస్టులు దక్కేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో గొడవలు చేసే నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా అధ్యక్షులకు సూచించారు. పార్టీ వదిలితే రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వమే రాబోతుందని అన్నారు. బీజేపీ గెలుపు, ప్రయోజనాలే తమకు ముఖ్యమని, బ్లాక్ మెయిల్‌కు లొంగనని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి లేదని, కేంద్ర నిధులతోనే ప్రగతి జరుగుతోందని విమర్శించారు. బీజేపీకి ఓటేస్తే అభివృద్ధి చూపిస్తామని, ఇంటింటికీ ప్రచారం చేయాలని.. బోగస్ ఓట్లను పరిశీలించి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని పార్టీ శ్రేణులకు బండి సంజయ్ దిశానిర్దేశం చేశారు.



# హరీశ్ చెప్పేవన్నీ అబద్ధాలే..

- కృష్ణా జలాలపై సెంటిమెంట్ రగిల్చే కుట్ర
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, (ప్రజాస్వరం):

మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాకు చూపిస్తున్న డాక్యుమెంట్లు అన్నీ ఫేక్ అని, ఆయన చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ, కృష్ణా నదీ జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు బనకచర్ల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టుకు అసలు సీడబ్ల్యూసీ అప్రూవలే లేదని ఆయన స్పష్టం చేశారు. నాడు కేసీఆర్ 299 టీఎంసీలకు సంతకం చేసి తెలంగాణకు తీరని అన్యాయం చేశారని, ఇప్పుడు ఆ నెపాన్ని ఇతరులపైకి నెట్టేందుకు డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.

**కుమ్మక్కు రాజకీయాలు..**

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని ఏలేటి ఆరోపించారు. మూడో శక్తి ఎదగకుండా ఉండేందుకు ఐదేళ్లు ఒకరు, మరో ఐదేళ్లు ఇంకొకరు అధికారంలో ఉండాలని ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. 'బయట రేవంత్ రెడ్డి తొండలు జొర్రగొడతాం అంటారు.. కానీ, అసెంబ్లీకి రాగానే వంగి వంగి దండాలు పెడుతుంటారు' అని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా, సభకు రాని నాయకుడు చెప్పిన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వానికి సమయం ఎక్కడిదని ప్రశ్నించారు.

**ప్రాజెక్టుల్లో వైఫల్యాలు..**

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ చేసిన తప్పిదాల వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఏలేటి పేర్కొన్నారు. నాడు రోజుకు 2 టీఎంసీల తరలింపుతో మొదలై, నేడు ఏపీ రోజుకు 10 టీఎంసీల నీటిని తరలించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జున సాగర్ ద్వారా తెలంగాణకు కేవలం 56 లక్షల ఎకరాల సాగునీరు అందుతుంటే, ఏపీ మాత్రం 18 నుంచి 20 లక్షల ఎకరాలకు నీటిని తీసుకెళ్తోందని వివరించారు. బీఆర్ఎస్ నేతల అవినీతిపై ఆధారాలు ఉన్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంత స్మార్ట్‌గా అవినీతి చేసినా, ఎక్కడ సంతకాలు చేయకపోయినా ఏదో ఒక రోజు దొరికిపోవడం ఖాయమని ఏలేటి హెచ్చరించారు.




# ఎస్ఎస్ 3 విజయవంతం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో కీలక ముందడుగు వేసింది. చిన్న ఉపగ్రహాల ప్రయోగాల కోసం రూపొందిస్తున్న స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్వీ) కార్యక్రమంలో భాగంగా, మూడో దశ అయిన ఎస్ఎస్-3 (ఎస్ఎస్ 3)ను విజయవంతంగా పరీక్షించింది. ఈ స్టాటిక్ ఫైర్ టెస్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్డీఎస్సీ)లో ఉన్న సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ కేంద్రంలో మంగళవారం నిర్వహించింది. మూడు దశలతో కూడిన ఆల్-సాలిడ్ లాంచ్ వెహికల్ అయిన SSLV పనితీరును సమగ్రంగా విశ్లేషించడంతో పాటు, కీలక సాంకేతిక డేటాను ఈ పరీక్షలో సేకరించినట్లు ఇస్రో వెల్లడించింది. భవిష్యత్తులో చిన్న ఉపగ్రహాలను తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఎస్ఎస్ఎల్వీని అభివృద్ధి చేస్తున్నారు. వాణిజ్య ప్రయోగాలకు అనువుగా, అధిక స్థాయిలో ఉత్పత్తి చేసే సామర్థ్యం కూడా దీనికి ప్రత్యేకతగా అధికారులు పేర్కొన్నారు. మూడో దశ అయిన SS3, పేలోడ్‌కు సెకనుకు సుమారు 4 కిలోమీటర్ల వేగం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. తాజా అప్‌గ్రేడ్‌ల ద్వారా ఈ దశ పేలోడ్ సామర్థ్యాన్ని సుమారు 90 కిలోల వరకు పెంచే అవకాశం ఏర్పడిందన్నారు. ఇది చిన్న ఉపగ్రహాల ప్రయోగాల్లో మరింత వశ్యతను అందించనుంది. ఈ పరీక్షలో భాగంగా ఒత్తిడి (ప్రెజర్), థ్రస్ట్, ఉష్ణోగ్రత, వైబ్రేషన్, యాక్యుయేటర్ పనితీరు* వంటి అనేక కీలక అంశాలను సవివరంగా పరిశీలించినట్లు ఇస్రో తెలిపింది.



# యూట్యూబర్ అన్వేష్‌పై కేసులు


**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
హైదరాబాద్‌లోని ప్రముఖ టాలీవుడ్ వ్యక్తి మరియు సినీనటి కరాటే కల్యాణి, ప్రముఖ ట్రావెల్ యూట్యూబర్ అన్వేష్ (నా అన్వేషణ ఛానల్ నిర్వాహకుడు) పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో అన్వేష్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు మరియు అభ్యంతరకరమైన కంటెంట్ ప్రచారం చేశాడని ఆమె ఆరోపించారు. దీంతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో అన్వేష్‌పై కేసు నమోదైంది. ఈ ఫిర్యాదు ప్రకారం, అన్వేష్ తన యూట్యూబ్ ఛానల్ ద్వారా వివాదాస్పద మెటీరియల్‌ను ప్రసారం చేసి, హిందూ దేవతలు మరియు సాంస్కృతిక విలువలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశాడని పేర్కొన్నారు. అన్వేష్ విశాఖపట్నానికి చెందిన యువకుడు, ప్రస్తుతం విదేశాల్లో ఉంటూ తన యూట్యూబ్ ఛానల్ 'నా అన్వేషణ'ను నిర్వహిస్తున్నాడు. ఇటీవల అతడు విడుదల చేసిన ఒక వీడియోలో హిందువులు పూజించే సీతాదేవి మరియు ద్రౌపది దేవతలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశాడని ఆరోపణలు ఉన్నాయి. ఇది భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, విశ్వహిందూ పరిషత్ (VHP) సభ్యులు మరియు ఇతరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి తెలంగాణలోని ఖమ్మం జిల్లాలోని ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో కూడా అన్వేష్‌పై మరో కేసు నమోదైంది. దానవాయిగూడెకు చెందిన జి. సత్యనారాయణరావు అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ ప్రకారం, అన్వేష్ హిందూ మత విశ్వాసాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశాడని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఈ వివాదం సోషల్ మీడియాలో వేగంగా వ్యాపించింది. హెచ్ఎమ్‌టీవీ, ఎబిపి దేశం, జీ తెలుగు న్యూస్ వంటి మీడియా సంస్థలు ఈ వార్తను కవర్ చేశాయి. కరాటే కల్యాణి తన ఫిర్యాదులో అన్వేష్‌ను డిఫామేషన్‌కు పాల్పడ్డాడని ఆరోపించారు, మరియు ఇది సైబర్ క్రైమ్ పోలీసుల దృష్టికి కూడా వచ్చింది. ప్రస్తుతం పోలీసులు రెండు చోట్లా విచారణ చేపట్టారు, మరియు అన్వేష్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. ఈ ఘటన యూట్యూబర్లు సోషల్ మీడియాలో చేసే




వ్యాఖ్యలపై మరిన్ని చర్చలకు దారితీసింది.

# క్లీన్ హైదరాబాదే మా లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**
ఆయన వివరించారు. ఈ డ్రైవ్‌లో లెగసీ వేస్ట్ (పాత చెత్త) తొలగింపు, డంపింగ్ పాయింట్లను 'సెల్ఫీ పాయింట్లు'గా మార్చడం, అవేర్నెస్ క్యాంపెయిన్స్, ఆర్ఆర్ఆర్ (రీసైకిల్, రీయూస్, రీడ్యూస్) ఇనిషియేటివ్స్ వంటివి ఉంటాయని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రోజువారీ ఫీల్డ్ విజిట్లు, స్మార్ట్ గవర్నెన్స్‌తో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచనున్నట్లు కర్ణన్ పేర్కొన్నారు. ఈ డ్రైవ్ సమయంలో పాత పబ్లిక్ టాయిలెట్లను రెనోవేట్ చేయడం, అన్‌క్లెయిమ్డ్ స్క్రాప్ వెహికల్స్ తొలగింపు, రోడ్లు, లేక్స్, నాలాల క్లీనింగ్ వంటి పనులు చేపట్టనున్నారు. జీహెచ్ఎంసీ పరిధి ఇటీవల విస్తరణతో 650 చదరపు కిలోమీటర్ల నుంచి సుమారు 2,000 చదరపు కిలోమీటర్లకు పెరిగిందని, దీంతో 300 వార్డుల్లో రోజుకు 9,000 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని కమిషనర్ వెల్లడించారు. ఈ పెరిగిన వేస్ట్‌ను నిర్వహించేందుకు కొత్త డంపింగ్ యార్డుల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రోజుకు 8,600 మెట్రిక్ టన్నుల వేస్ట్‌ను హ్యాండిల్ చేస్తోందని, కానీ పరిధి విస్తరణతో మరిన్ని యార్డుల అవసరం ఉందని, నగరం నాలుగు వైపులా నాలుగు కొత్త డంపింగ్ యార్డుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి సూచనల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. అలాగే, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజీని అమలు చేస్తూ, రీసైక్లింగ్ యూనిట్లు, కంపోస్టింగ్ ప్లాంట్లను మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు కర్ణన్ తెలిపారు. అదనంగా, వేస్ట్‌టుఎనర్జీ సొ




ల్యూషన్లపై దృష్టి సారిస్తున్నట్లు, ప్యారా నగర్ ప్లాంట్ 2025 నాటికి ఆపరేషనల్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆస్తి పన్ను వసూలుపై మాట్లాడుతూ, వచ్చే ఆర్థిక సంవత్సరం (2026 27)కు రూ.3,000 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఇటీవల జరిగిన జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) సర్వే ద్వారా నగరంలోని సుమారు 14 లక్షల ప్రాపర్టీలను మ్యాపింగ్ చేశామని, ఇందులో దాదాపు 1 లక్ష మంది యజమానులు కట్టాల్సిన పన్ను కంటే తక్కువ చెల్లిస్తున్నట్టు గుర్తించామని ఆయన తెలిపారు. ఈ సర్వేను డ్రోన్లు, డిజిటల్ మ్యాపింగ్‌తో చేపట్టామని, దీంతో పన్ను వసూళ్లు 5080 శాతం పెరుగుతాయని అంచనా వేస్తున్నట్లు కర్ణన్ పేర్కొన్నారు. మధ్యవర్తులు లేకుండా పౌరులు జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ (www.ghmc.gov.in) లేదా మొబైల్ యాప్ ద్వారా నేరుగా పన్ను చెల్లించవచ్చని సూచించారు. అలాగే, ప్రాపర్టీ రికార్డులను డిజిటలైజ్ చేసి 1.8 మిలియన్ బిల్డింగ్‌లను ట్రాక్ చేస్తున్నట్లు, దీంతో మోసాలు తగ్గుతాయని ఆయన వివరించారు. ఇటీవల జీహెచ్ఎంసీ 2026 బడ్జెట్‌ను రూ.11,460 కోట్లుగా ఆమోదించింది, ఇందులో ఆస్తి పన్ను నుంచి రూ.2,245 కోట్లు ఆశిస్తున్నట్లు తెలిసింది.నగర రవాణా సదుపాయాల మెరుగుదలపై మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్లు, బ్రిడ్జిల నిర్మాణాన్ని ఏప్రిల్ 2026 నాటికి పూర్తి చేయనున్నట్లు కర్ణన్ ప్రకటించారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌సీఐటీఐ) ప్రాజెక్టు కింద 32 ప్రాజెక్టులను త్వరలో ప్రారంభిస్తామని, ఇందులో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మెరుగుదల వంటివి ఉంటాయని ఆయన తెలిపారు. అలాగే, తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) అభివృద్ధికి ఐదేళ్ల యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు, దీంతో నగరం పొల్యూషన్‌ఫ్రీగా మారుతుందని కర్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రకటనలు డిసెంబర్ 2025లో జరిగిన ప్రెస్ మీట్‌లో భాగంగా వచ్చాయి, ఇవి నగర అభివృద్ధికి కీలకమైనవిగా పరిగణించబడుతున్నాయి.





## ఇందుర్తి ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

**కరీంనగర్, డిసెంబర్ 31(ప్రజాస్వరం):**
చిరుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో ఆక్స్ఫర్డ్ స్కూల్లో ముందస్తుగా ఫుడ్ ఫెస్టివల్ నూతన సంవత్సర వేడుకలు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచనలు ఇచ్చారు డ్రైఫ్రూట్స్ పండ్లు విద్యార్థులకు అందజేశారు ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యతో పాటు గేమ్స్, కరాటే, డ్యాన్స్ మానసిక ఉల్లాసాన్ని ఉపాధ్యాయులు కలిగిస్తున్నారు అని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# భద్రాద్రి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- **జూలై 23 2027 నుండి ప్రారంభం కానున్న పుష్కర ఏర్పాట్లపై సమీక్ష**
- **భద్రాచలం రామాలయం మాడ వీధుల విస్తరణ ఆగమ శాస్త్రం ప్రకారం జరగాలి**
- **దశల వారీగా మూడు ఏళ్ళలో విస్తరణ పనులు పూర్తి చేయాలి**
- **సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన**
- **కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లు**
- **దేవాదాయ శాఖ కమీషనర్ కు మంత్రి తుమ్మల దిశానిర్దేశం**





**ప్రజాస్వరం, భద్రాద్రి కొత్తగూడెం:**
దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామయ్య ఆలయం నూతన శోభ సంతరించుకొనుంది. ఈ ఏడాది మార్చిలో జరిగే శ్రీరామ నవమి సీతారామ కళ్యాణం నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం దేవాదాయ శాఖ కమీషనర్ హరీష్ తో ఆలయ విస్తరణ పనులపై మంత్రి తుమ్మల చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ భద్రాద్రి రామయ్య అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న భూ సేకరణకు కాంగ్రెస్ సర్కారు ముఖ్యమంత్రి ఆదేశాలతో రూ.34 కోట్లు విడుదల చేయడంతో భూ సేకరణ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఆలయం విస్తరణ పనులు కోసం భూ సేకరణ పూర్తవడంతో ఆలయం మాడ వీధుల విస్తరణ పనులు, ప్రాకార నిర్మాణాలు చేపట్టాలని, ఆగమ శాస్త్రం ప్రకారం ఆర్కిటెక్ట్ ఇచ్చిన డిజైన్లు(మాస్టర్ ప్లాన్) ముఖ్య మంత్రి ఆమోదంతో ఫైనల్ చేసి పనులు మొదలు పెట్టాలని మంత్రి తుమ్మల సూచించారు. దీంతో దక్షిణ అయోధ్య టెంపుల్ సిటీకి అడుగులు పడనున్నాయని పేర్కొన్నారు.భద్రాచలం రామాలయం మాడ వీధుల విస్తరణ పనులు ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మాణం చేయాలని మంత్రి తుమ్మల తెలిపారు. దక్షిణ అయోధ్య గా భాసిల్లుతున్న భద్రాచలం రామాలయం 1664లో భక్త రామదాసు నిర్మాణం చేశారని తెలిపారు. పెరుగుతున్న భక్తుల సౌకర్యం కోసం ఆలయం విస్తరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రామాలయం మాడ వీధుల విస్తరణ పనులు దశల వారీగా మూడు ఏళ్ళలో పూర్తి చేయాలని దేవాదాయ శాఖ కమీషనర్ హరీష్ కు మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

**భద్రాద్రి అభివృద్ధికి అడుగులు**
భారతదేశానికి తలమానికంగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అనేక ఏళ్లుగా పెండింగ్లో ఉన్న భూసేకరణ సమస్యకు ఎట్టకేలకు మంత్రి తుమ్మల పరిష్కారం చూపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నవ భద్రాద్రి దిశగా తుమ్మల కృషి చేస్తున్నారు. భూ సేకరణ తరువాయి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దక్షిణ అయోధ్యగా భద్రాద్రి ఆలయ కీర్తి ధ్వనించేలా అభివృద్ధి చేయనున్నారు.

**నమూనాలు సిద్ధం**
శ్రీరామచంద్రుడి ఆలయ అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణలో భద్రాద్రి ఆలయం నూతన శోభ సంతరించుకొనుంది. ఆగమ పండితులు రూపొందించిన నమూనాల ప్రకారం అభివృద్ధి పనులను ప్రారంభించేలా మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ నమూనాల ప్రకారం అత్యద్భుతంగా భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణానికి అడుగులు పడనున్నాయి.

**గోదావరి పుష్కరాలు కుంభ మేళా మాదిరి ఏర్పాట్లు..**
వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పై దేవాదాయ శాఖ కమీషనర్ తో చర్చించారు. పుష్కర ఏర్పాట్లపై అన్నీ శాఖలతో సన్నాహక సమావేశం నిర్వహించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. కుంభమేళా తరహాలో భద్రాచలం లో పుష్కరాల ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం రామాలయం దర్శనానికి గోదావరి నదిలో పుష్కర స్నానానికి లక్షలాది మంది భక్తులు వస్తారని ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్నానాల ఘాట్లు ఏర్పాటు చేయాలని వసతి కేంద్రాలు, మెడికల్ క్యాంప్‌లు శానిటేషన్, తాగునీరు, రవాణా సౌకర్యాలు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని పుష్కరాల ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు. 2003 లో 2015లో గోదావరి పుష్కరాలు సమయంలో మంత్రిగా ఉన్న తుమ్మల అప్పటి అనుభవాలను గుర్తు చేసారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ముందస్తు ప్రణాళికలపై ఎండోమెంట్ కమీషనర్ కు మంత్రి తుమ్మల తన అనుభవాలు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణ ప్రభుత్వ ప్రతిష్ట పెంచేలా ఉండాలని కోట్లాది మంది భక్తులు మెచ్చేలా పుష్కరాల ఏర్పాట్లు చేయాలని ఎండోమెంట్ కమీషనర్ హరీష్ కు మంత్రి తుమ్మల ప్రభుత్వ విధానం వివరించారు.

## నూతన సంవత్సరం టీఆర్పీలో చేరికలు జోష్

- **మండల మహిళ అధ్యక్షులు పల్లవి ఆధ్వర్యంలో చేరికలు.**
- **కండువాలు కప్పి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు.**
- **మహిళలు ముందు వరుసలో ఉండాలన్న అరుణ సూచన.**
- **జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ని సన్మానించిన అఖిల్ పాషా.**

**కరీంనగర్, డిసెంబర్ 31(ప్రజాస్వరం):**
కరీంనగర్ జిల్లా టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ గంగాధర మండల మహిళా అధ్యక్షురాలు జింక లావణ్య ఆధ్వర్యంలో పలువురు మహిళలు తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరారు. వారికి ఆన్లైన్ లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేసిన అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. అనంతరం కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన షేక్ చాంద్ పాషా గారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ మండల మరియు గ్రామ కమిటీల నిర్మాణం వేగవంతం చేయాలని అన్నారు. పార్టీలో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా నూతన సభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. గత కొన్నేళ్లుగా అగ్రవర్ణాలు పెత్తనం చేలాయించి ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్యాయం చేసారని మండిపడ్డారు. టీఆర్పీ పార్టీ అధికారంలోకి రాగానె మొట్ట మొదట ఈడబ్ల్యూఎస్ కోటను రద్దు చేయిస్తామని చెప్పుకొచ్చారు. ఇన్నేండ్ల అగ్రవర్ణాల పాలన బిసిలకు ఏరోజు కూడా ఎలాంటి రంగాలలోనైనా న్యాయం చేయలేదని అన్నారు. బీసీ రాజ్యాధికారం సాదించుకోవడం టీఆర్పీ పార్టీ తోనే సాధ్యమైతుందని తెలిపారు. మహిళలు టీఆర్పీ పార్టీలో పెద్ద ఎత్తున చేరాలని, మహిళల పాత్ర పార్టీలో కీలకమైనదని అన్నారు. మేమెంతో మాకంత అనే నినాదంతో ప్రజా క్షేత్రంలోకి పార్టీ వెళ్తుందని, అగ్రవర్ణాల దోపిడీని అరికట్టేలా పార్టీ శ్రేణులు కష్టపడాలని తెలిపారు. పార్టీలో చేరిన నూతన సభ్యులు కొలపాక విజయ, మమత, జలశిలా, ఇంద్ర, శంకరమ్మ, పద్మ, రాజవ్వ, అనిత, రాజవ్వ, శ్రీనివాస్, అంజి లు పార్టీ బలోపేతానికి ముందు వరుసలో ఉండాలని అఖిల్ పాషా సూచన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా మహిళ అధ్యక్షులు విజయ లక్ష్మి, మహిళా టౌన్ ప్రెసిడెంట్ జింక లావణ్య, జిల్లా మహిళ కార్యదర్శి ఇశ్రత్ శావాళి, జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి అంకుష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆడవాళ్ల జోలికొస్తే తాట తీస్తాం

- **ఈవ్ టీజింగ్‌పై 2 ఎఫ్ఐఆర్‌లు, 7 ఈ–పెట్టి కేసులు నమోదు**
- **డిసెంబర్ లో 64 మందికి కౌన్సెలింగ్, 38 అవగాహన కార్యక్రమాలు**
- **మహిళల భద్రతకు షీ–టీమ్స్ తో కట్టుదిట్టమైన చర్యలు**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు**

**మెదక్ డిసెంబర్ 31 (ప్రజా స్వరం) :**

మెదక్ జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు షీ-టీమ్స్ పటిష్టంగా పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. డిసెంబర్ నెలలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన వారిపై 02 ఎఫ్ఐఆర్‌లు, 07 ఈ-పెట్టి కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రెడ్ హ్యాండ్‌గా తూప్రాన్ సబ్‌డివిజన్‌లో 16 మంది, మెదక్ సబ్‌డివిజన్‌లో 48 మంది మొత్తం 64 మందిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, బస్ స్టాప్‌లు, రద్దీ ప్రాంతాల్లో 38 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా మహిళలను లేదా బాలికలను వేధించినా, అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్-100 లేదా షీ-టీమ్ వాట్సాప్ నంబర్ 8712657963 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండకముందే బాలికల వివాహాలు జరిగితే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. మెదక్ జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ప్రారంభించామని, మనుషుల అక్రమ రవాణా లేదా ఆర్గనైజ్డ్ నేరాలపై సమాచారం అందించాలని తెలిపారు. ఈ షీ-టీమ్స్ తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో షీ-టీమ్ సిబ్బంది, ఎఎస్ఐ వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుళ్లు ప్రమీల, విజయ్, స్వరూప, గంగామణి, హెచ్‌జీలు విజయ రాణి, సురేష్ కుమార్ తమ తమ డివిజన్లలో విధులు నిర్వహిస్తున్నారు.




# మెదక్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- **మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి**

**రామయంపేట. 31.(ప్రజాస్వరం)**

మెదక్ జిల్లా ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ మెదక్ మాజీ ఎమ్మెల్సీ సేరి సుభాష్ రెడ్డి .ఈ నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ నూతన 2026 సంవత్సరంలో నూతన ఉత్సహంతో నూతన పనులను ప్రారంభించి ఆనందంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.నూతన సంవత్సర వేడుకలు జాగ్రత్తగా నిర్వహించుకోవాలని సూచించారు.



# యూరియా కోసం ఆందోళన వద్దు

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, డిసెంబర్ 31 (ప్రజా స్వరం) :**

జిల్లాలో ఉన్న అన్ని ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ తెలిపారు. అక్టోబర్ 2025 జనవరి 26 సంవత్సరానికి మన జిల్లాకు 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని రాష్ట్రానికి ప్రతిపాదనాలు పంపమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 30 వరకు మెదక్ జిల్లాకు 12663 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, 8000 మెట్రిక్ టన్నుల యూరియా రైతులు ఇప్పటి వరకు కొనుగోలు చేయడం కూడా జరిగిందన్నారు. ఇంకా జిల్లాలో 4000 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, జిల్లాలో మన అవసరానికి మించి యూరియా జనవరి కి కూడా రాబోతుందని రైతులు గమనించాలని పేర్కొన్నారు. రైతులు యూరియా దొరకదేమోనని ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు





# ఆదర్శ గ్రామ అభివృద్ధికి సహకరించాలి

- **జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన సర్పంచ్ ఆంజనేయులు గౌడ్**

**తూప్రాన్, (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ను పాలకవర్గ సభ్యులతో కలిసి సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ కలెక్టర్ కార్యాలయంలో విన్నవించారు. పంచాయతీ పాలకవర్గం గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ నూతన పాలకవర్గానికి సూచించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ నగేష్ గౌడ్, డి ఆర్డిఓ శ్రీనివాసరావు, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పల్లె పాటి స్వామి, మాజీ సర్పంచ్ నవీన్ యాదవ్, వార్డు సభ్యులు సరిత పరమేష్ గౌడ్, జిన్న కృష్ణ, పిట్ల వేణు, రేఖ నాగరాజు గౌడ్, నాయకులు కొండల్ రెడ్డి లు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలు
# సంతోషంగా జరుపుకోవాలి

- **తూప్రాన్ డీఎస్పీ నరేందర్**

**తూప్రాన్ డిసెంబర్ 31 (ప్రజాస్వరం) :**

నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ కోరారు. ప్రజాస్వరం ప్రతినిధి తో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 పురస్కరించుకొని తూప్రాన్ సబ్ డివిజన్ పరిధిలో 30 బృందాలు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. నూతన సంవత్సరంలో కోర్టుల చుట్టూ తిరిగే పనులు తెచ్చుకోవద్దని సూచించారు. ఫామ్ హౌస్, రిసార్ట్ లలోచట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టి ఇబ్బందులకు గురికా వద్దని పేర్కొన్నారు యువత మద్యం సేవించి వాహనాలు నడుపుతూ రోడ్డుపైకి రావొద్దని డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే వాహనాలు సీజ్ చేసి కోర్టులో ప్రవేశపెట్టి కేసులు నమోదు చేస్తాం అనితూప్రాన్ డిఎస్పీ నరేందర్ గౌడ్ హెచ్చరించారు డివిజన్ పరిధి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు




# రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో ద్వితీయ స్థానం

- **జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రభాకర్ గౌడ్‌కు జిల్లా ఎస్పీ సన్మానం**

**మెదక్ డిసెంబర్ 31 (ప్రజా స్వరం) :**

కరీంనగర్ లో నిర్వహించిన 12 వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో మెదక్ జిల్లా పోలీస్ విభాగానికి చెందిన ప్రభాకర్ గౌడ్ ద్వితీయ స్థానం సాధించి, జైపూర్ లో జరగనున్న జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు అన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ గౌడ్ ను మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటడం అభినందనీయమని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ క్రమశిక్షణ, కఠిన సాధనతో రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరుగైన ఫలితాలు సాధించడం ఇతర సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. పోలీస్ విధుల బాధ్యతలతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ క్రీడల్లో ముందుకు సాగడం వల్ల మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సాధించిన ఈ విజయం జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబర్చేందుకు దోహదపడుతుందని ఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు. జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మెదక్ జిల్లా పోలీస్ విభాగానికి మంచి పేరు తీసుకురావాలని ప్రభాకర్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ రంగా నాయక్, ఆర్ఐ శైలందర్, ఎస్‌బీ సీఐ సందీప్ రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ మధుసూధన్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రభాకర్





# హరీశ్ రావును కలిసిన పద్మాదేవేందర్ రెడ్డి

**మెదక్, డిసెంబర్ 31 (ప్రజా స్వరం) :**

బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష ఉప నేతగా మాజీ మంత్రి హరీశ్ రావు నియామకం తెలిసిందే.. ఈ సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ శాసనసభలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల ను నియమించారు. శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష ఉప నేతగా మాజీ మంత్రులు హరీశ్ రావు ని నియమించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి మాజీ మంత్రి హరీష్ రావు ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.





## ముసాయిదా మున్సిపల్
# ఓటర్ జాబితా ప్రదర్శన

**తూప్రాన్ డిసెంబర్31 (ప్రజాస్వరం) :**

అక్టోబర్ 1, 2025 న కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన అసెంబ్లీ ఓటరు జాబితాను ప్రాతిపదికగా తీసుకొని, రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం మున్సిపల్ ఓటర్ జాబితాను వార్డు వారీగా విభజించి, తూప్రాన్ మున్సిపాలిటీకి సంబంధించిన ముసాయిదా మున్సిపల్ ఓటర్ జాబితాను రేపు అనగా జనవరి 1, 2026 న ప్రజల పరిశీలనార్థం ప్రదర్శించనున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రా రెడ్డి తెలిపారు. ఈ రోజు తూప్రాన్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి, వార్డ్ వారిగా తయారు చేస్తున్న ఓటరు జాబితాను మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి తో కలిసి పరిశీలించి, సిబ్బంది కి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 16 వార్డులకు సంబంధించి 32 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ స్టేషన్ వారీగా ఈ ముసాయిదా ఓటర్ జాబితాను ఉంచి, ప్రజల నుండి అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో కొత్త ఓటర్ల నమోదు గానీ, ఉన్న ఓటర్ల పేర్ల తొలగింపు గానీ జరగదని స్పష్టం చేశారు. అయితే, వార్డు వారీగా జరిగిన విభజనలో ఒక వార్డుకు చెందిన ఓటరు పేరు వేరే వార్డులో నమోదై ఉంటే, అటువంటి అంశాలపై మాత్రమే అభ్యంతరాలు స్వీకరించి, సంబంధిత విచారణ అనంతరం అవసరమైన సవరణలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిశీలించిన తరువాత, తుది మున్సిపల్ ఓటర్ జాబితాను జనవరి 10, 2026 న ప్రదర్శించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు RDO జయ చంద్రా రెడ్డి తెలిపారు.

# గ్రామ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- **సర్పంచ్ స్రవంతి రాజేందర్**

**రామాయంపేట, (ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామం ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన గ్రామపంచాయతీ సర్పంచ్ స్రవంతి రాజేందర్ గుప్తా..ఈ నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ నూతన 2026 సంవత్సరంలో నూతన ఉత్సహంతో నూతన పనులను ప్రారంభించి ఆనందంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.నూతన సంవత్సర వేడుకలు జాగ్రత్తగా నిర్వహించుకోవాలని సూచించారు.



# నట్టల నివారణ మందుల పంపిణీ



**మనోహరాబాద్, ప్రజాస్వరం :**

గ్రామంలో మేకలు, గొర్రెలకు నత్తల నివారణకు సంబంధించిన మందులను ఈరోజు పంపిణీ చేశారు. పశుసంపద ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశం , ఉప సర్పంచ్ లక్ష్మి , వార్డ్ సభ్యులు జనగిరి, నాగరాజు, భాగ్యమ్మ,ఆంజనేయులు, సున్నం రాజు, అశోక్ పాల్గొనగా, పశు వైద్య విభాగం నుంచి VLO రవి, LSA రాజీ రెడ్డి, VA మల్లేష్, OS చిరంజీవి, గోపాల మిత్ర చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే యాదవ సంఘం అధ్యక్షులు నగేష్ యాదవ్,మల్లేష్ యాదవ్ పూదూరు స్వామి,కార్యదర్శి స్వామి చెర్లపల్లి నవీన్ కుమార్ గౌడ్ హాజరయ్యారు.

## అయ్యప్ప నామస్మరణ
# సకల సుభిక్షాలు కల్పిస్తుంది



- **మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్**

**తూప్రాన్/ మనోహరాబాద్ (ప్రజాస్వరం) :**

అయ్యప్ప దీక్ష సకల సుభిక్షులు కల్పిస్తుందని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చూడలేని ఎంచుకోవాలని మెదక్ జిల్లా జెడ్పి చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ అన్నారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో గల మల్లన్న ఆలయం వద్ద అయ్యప్ప దీక్ష పూర్తి చేసుకొని శబరిమలై యాత్రకు బయలుదేరుతూ నిర్వహించే ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని వారిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక అలవాట్లు ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలదరణ స్వాములు భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

- **తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి**


**తూప్రాన్, ప్రజా స్వరం :**

తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి, ఆకస్మికతనిఖీ చేసిన తూప్రాన్ తహసీల్దార్ చంద్ర శేఖర్ రెడ్డి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రిలో గల సేవలు మరియు సిబ్బంది అందిస్తున్న సేవలు తెలుసుకోవడం జరిగినది. మరియు తాసిల్దార్ గారు మరియు తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం జరిగినది. మరియు ప్రజలకు ఈ ఉచిత ఆరోగ్య పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటాయని అందరూ ఉపయోగించుకోవాలని తహసీల్దార్ తెలియజేయడం జరిగినది.



# జగ్గారెడ్డి స్వగృహంలో సత్యనారాయణ వ్రతం

- అయ్యప్ప మహా పడి పూజ..
- పూజలో పాల్గొన్న దంపతులు జయా-గుణ., దత్తు, జగ్గారెడ్డి, నిర్మల
- ప్రతీ ఏటా డిసెంబర్ 31 న జగ్గారెడ్డి స్వగృహం లో ఆనవాయితీగా సత్యనారాయణ స్వామి కథ, అయ్యప్ప మహా పడి పూజ
- పెద్ద ఎత్తున పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు, నాయకులు, కార్యకర్తలు



**సంగారెడ్డి,(ప్రజాస్వరం) :**

సంగారెడ్డి పట్టణం లోని రామ్ నగర్ రామ్ మందిర్ వద్ద కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్వగృహం లో సత్యనారాయణ కథ, అయ్యప్ప మహా పడి పూజలు ఘనంగా జరిగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతీ ఏటా డిసెంబర్ 31 న ఆనవాయితీగా ఈ పూజలను జగ్గారెడ్డి నిర్వహిస్తుంటారు. ప్రతీఏడు మాదిరిగానే ఈ సారి సైతం ఈ పూజలు కన్నుల పండుగ గా జరిగాయి. ఉదయం 10 గంటలకు సత్యనారాయణ స్వామి కథ తో ప్రారంభమయ్యే ఈ పూజ కార్యక్రమాల్లో మధ్యాహ్నము అయ్యప్ప పూజ, సాయంత్రం మొదలుకుని అర్ధరాత్రి వరకు మహా పడి పూజా కార్యక్రమాలు ఉంటాయి. ఈసారి ప్రత్యేకంగా మధ్యాహ్నము యోగిని పుష్పార్చన, రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భజన బృందాల చే ఏర్పాటు చేసిన భజనలు భక్తులను అలరించాయి. ఈ పూజా కార్యక్రమాల్లో జగ్గారెడ్డి కుమార్తె , అల్లుడు జయా గుణ లతో పాటు కుమారుడు దత్తు, జగ్గారెడ్డి, నిర్మల పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక నిల్వలను సీజ్

**రామాయంపేట, ప్రజాస్వరం :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా నిలువ ఉంచిన ఇసుక గొప్పలను ఇన్స్పెక్టర్ గోపి సీజ్ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝాన్సీ లింగాపూర్ శివారులో అక్రమంగా ఇసుక నిలువ ఉంచినట్టు సమాచారం రావడంతో సంఘటన అవసరానికి చేరుకోవడం జరిగిందని నిలువ ఉంచిన ఇసుక కుప్పల సమాచారాన్ని తహసిల్దార్ రజనీకుమారికి సమాచారం అందించి సీజ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

## అంబేద్కర్ నగర్‌ను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలి



- మంత్రి శ్రీధర్ బాబుకు స్థానిక నాయకుల వినతి

**జవహర్ నగర్, డిసెంబర్ 31, ప్రజాస్వరం :**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ జి హెచ్ఎంసి లో విలీనం చేసి ఢిల్లీ టేషన్ లో భాగంగా జవహర్ నగర్, చంద్రపురి కాలనీ రెండు డివిజన్లను ఏర్పాటు చేశారని దీనిలో చెన్నాపురం నుండి అంబేద్కర్ నగర్ వరకు ప్రత్యేకంగా అంబేద్కర్ నగర్ డివిజన్ ఏర్పాటు చేయాలని బుధవారం స్థానిక నాయకులు మంత్రి శ్రీధర్ బాబును కలిసి వెరైటీ పత్రం అందజేశారు. అభ్యంతరాల స్వీకరణలో భాగంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాన్ని కూడా అందజేశామని గ్రామపంచాయతీ ఏర్పాటు అయినప్పటి నుండి ప్రస్తుతం 50 కాలనీలకు పైగానే అంబేద్కర్ నగర్ నుండి చెన్నాపురం వరకు కాలనీలో ఉన్నాయని వీటిని పరిగణలోనికి తీసుకొని ప్రత్యేక డివిజన్ గా ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు వెంటనే ప్రత్యేక డివిజన్ ఏర్పాటుపై జిల్లా కలెక్టర్ మను చౌదరి ,మున్సిపల్ అధికారులతో చర్చించి ప్రత్యేక డివిజన్ గా అంబేద్కర్ నగర్ ను ఏర్పాటు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జింక నాగులు ముదిరాజ్, సిద్ధులు యాదవ్, సురేష్, శివ ,అంబేద్కర్ నగర్, కొండవీటి రాయన్న కాలనీ, దొండ తోట,అయ్యప్ప కాలనీ, కేవిఎన్ఆర్ కాలనీ,ప్రగతి నగర్, కృష్ణా నగర్ కాలనీ, చెన్నాపురం. బి జె ఆర్ నగర్,కాలనీవాసులు పాల్గొన్నారు.

## 35 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు

- ఏఎస్ఐ కృష్ణంరాజు పదవి విరమణ

**రాయపోల్, డిసెంబర్ 31(ప్రజాస్వరం) :**

వృత్తి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖలో 35 సంవత్సరాల పాటు సేవలందించిన సిద్దిపేట జిల్లా రాయపోల్ ఏఎస్ఐ కృష్ణంరాజు పదవి విరమణ చేయడం బాధాకరమని తొగుట సిఐ షేక్ లతీఫ్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ తప్పదని, అయితే కృష్ణంరాజు అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని ఆయన పేర్కొన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలోని జివిఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పదవి విరమణ కార్యక్రమంలో రాయపోల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏఎస్ఐ కృష్ణంరాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ లతీఫ్ మాట్లాడుతూ, కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించిన కృష్ణంరాజు క్రమంగా అంచెలంచెలుగా ఎదిగి ఏఎస్ఐ స్థాయికి చేరుకుని విధులను నిబద్ధతతో, సమయపాలనతో నిర్వహించారని ప్రశంసించారు. ఎవరినీ నొప్పించకుండా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన వ్యక్తిగా ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని అన్నారు. పోలీస్ శాఖలో 35 ఏళ్ల సేవాకాలంలో అనేక ఉత్తమ అవార్డులు పొందడం గర్వకారణమని తెలిపారు. పదవి విరమణ అనంతరం కూడా తన అనుభవాన్ని సమాజ సేవకు వినియోగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఎస్సై మానసా, ఏఎస్ఐ దేవయ్య, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్ రెడ్డి, కనకయ్యతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ



**దౌల్తాబాద్ డిసెంబర్ 31(ప్రజాస్వరం) :**

మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మండల విద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. బోధన విధానాలు మరింత మెరుగుపడేలా ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల్లో శాతం వంద ఫలితాలు సాధించేలా విద్యార్థులను సమర్థంగా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, నాణ్యతతో పాటు పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు.

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

**దౌల్తాబాద్ డిసెంబర్31(ప్రజాస్వరం ) :**

దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సభ్యులు బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముందుగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు యాకటి ఆంజనేయులు, మండల సభ్యులు కర్రల నవీన్, అంగడి జలంధర్, నలక కరుణాకర్, ఉప్పరపల్లి రాజు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యక్షులు నలక రాజు, ఉడుత స్వామి, ప్రధాన కార్యదర్శి కొమ్ము నరసింహులు, కోశాధికారి బాగోళ్ల ముత్యం, సలహాదారులు ఉప్పరపల్లె స్వామి, సోషల్ మీడియా కన్వీనర్ బంగారుగళ్ల శివ జానీతో పాటు గ్రామ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దళితుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు.



## నేటి నుంచి మారోజు వీరన్న జయంతి ఉత్సవాలను జరపాలి

- విశ్వబ్రాహ్మణ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు

**జవహర్ నగర్, డిసెంబర్ 31, ప్రజాస్వరం:**



తెలంగాణ మలిదశ ఉద్యమ స్థాపికుడు, దళిత బహుజన ఉద్యమ సిద్ధాంతకర్త, మారోజు వీరన్న 64వ జయంతిని ప్రజలు ప్రజాసామికవాదులు తెలంగాణ ఉద్యమకారులు, విశ్వబ్రాహ్మణ సంఘాల శ్రేణులు ప్రతి ఒక్కరూ మండల గ్రామ జిల్లా కేంద్రాల్లో ఆయన చిత్రపటాన్ని పెట్టి ఘనంగా జయంతి ఉత్సవాలను జనవరి 1 నుండి 31 వరకు పెద్ద ఎత్తున నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు మారోజు సోమాచారి అన్నారు. బుధవారం జవహర్ నగర్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మారోజు వీరన్న చేసిన త్యాగ పలితాంగా,సాంస్కృతిక ఉద్యమ కార్యక్రమాల తో తెలంగాణ సిద్ధించిందని తెలంగాణ పౌరులుగా మహనీయునికి జయంతిని నిర్వహించే ఆయన ఆశలు నెరవేర్చాలన్నారు. ఆంధ్ర పాలకుల పరిపాలనలో జై తెలంగాణ అనడానికి భయపడే రోజుల్లో మారోజు వీరన్న తెలంగాణ మహాసభ ద్వారా లక్షలాది మందిని కదిలించి సాంస్కృతిక ఉద్యమానికి తెర లేపాడంజరిగిందని, అసిత్వ పోరాటాల ద్వారా హక్కులను సాధించి ఆత్మగౌరవ ఎజెండాతో మేమెంతో మాకు అంత వాటా అని నినాదించిన ఏకైక నాయకుడు మారోజు వీరన్న అని ఆయన అన్నారు.

## యాసంగి పంట రైతుబంధు వెంటనే వేయాలి

- బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు జుబైర్ పాషా

**గజ్వేల్, (ప్రజాస్వరం) :**



యాసంగి పంట రైతుబంధు వెంటనే వేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రైతుల అందించాల్సిన యూరియా అందుబాటులో ఉంచకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు, ఏజెడ్ ఫౌండేషన్ చైర్మన్ జుబైర్ పాషా జుబైర్ పాషా అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న కూడా ఇంతవరకు యాసంగి పంట రైతుబంధు వేయక పోవడమే కాకుండా కనీసం యూరియా బస్తాలు కుడా అందుబాటులో ఉంచకుండా రైతులను ఎన్ని రోజులని గోసపెడతారని ప్రశ్నించారు. మీకు నిజంగా రైతులపై ప్రేమ ఉంటే వెంటనే రైతు బందు వేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఈ యాసంగి పంటలో వరి నాట్లు వేసుకుంటారు కాబట్టి యూరియా బస్తాలు సప్లై అయన డిమాండ్ చేశారరు. మీరు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కెసిఆర్ గారిని టార్గెట్ చేసుకొని తిట్టడం తప్ప మీరు చేసింది ఏమీ లేదు. అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై మరియు 420 హామీల గురించి అడుగుతే, పండ పెట్టి తొక్కుతా, పేగు మెడల వేసుకుని ఊరేగుతా లాగులో తొండలు విడుస్తా అనే మాటలు మరిచిపోయి, ఇప్పటికైనా నూతన సంవత్సరంలో, ఆరు గ్యారెంటీలు 420 హామీ లు, అమలు చేసే దిశగా మీకార్యచరణ ఉండాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## మట్టి నమూనా పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

**చిన్న శంకరంపేట, ప్రజాస్వరం :**


చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులకు మట్టి నమూనా పరీక్షలపై కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మట్టి నమూనా సేకరించే పద్ధతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టులు ఎస్డీ నల్కర్, ప్రతాప్, సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లక్ష్మిప్రవీణ్, తెలంగాణ మోడల్ పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పథకంపై విచారణ చేపట్టాలి

**రామాయంపేట, ( ప్రజాస్వరం ) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామంలోని ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని గ్రామస్థులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీలో చేసిన తీర్మాల పత్రాలను డీఆర్డీఏ పీడీకి అందజేసి వినతి పత్రం సమర్పించారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.





## నీటి సమస్య పరిష్కారానికి బోర్లు

**మాసాయిపేట, ప్రజాస్వరం :**

మండల కేంద్రంలో నీటి సమస్య పరిష్కరించేందుకు నూతనంగా బోర్లను వేస్తున్నారు. మాసాయిపేట సర్పంచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా రెండు బోర్లను వేశారు. అలాగే రెండు పాత బోర్లను ఫ్రెస్సింగ్ చేసే పనులను చేపట్టారు. మాసాయిపేటలో తాగునీటి సమస్య లేకుండా చూసేందుకు బోర్లను వేస్తున్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి ఉపసర్పంచ్ పసుల వెంకటేష్ గ్రామ అధ్యక్షులు గుండారపు శీను వలకట్ల రమేష్ పెరిమల రమేష్ పంజా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# 24 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లకు పరిష్కారం.

- TCGOA డైరీ–క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ.
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది – మంత్రి
- 'రైజింగ్ కోఆపరేటివ్ తెలంగాణ–2047' దిశగా సంస్కరణలు అవసరం.

**హైదరాబాద్, డిసెంబర్ 31(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర సహకార గెజిటెడ్ అధికారుల సెంట్రల్ అసోసియేషన్ (TCGOA) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర సహకార అధికారుల డైరీ మరియు క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని గృహకల్ప భవన్, సహకార సంఘాల కమిషనర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సహకార రంగంలో డైరీ కీలక పాత్ర

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని మొట్టమొదటి సారిగా సహకార అధికారుల డైరీ 2026 నా చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అందుకు కమిటీ మొత్తాన్ని అభినందిస్తున్నాను. సహకార శాఖ ఉద్యోగులు ఆడిట్‌లు, పరిశీలనలు నిర్వహించే సమయంలో ప్రతి అంశాన్ని నమోదు చేసుకునేందుకు డైరీ అత్యంత కీలకమని తెలిపారు. నాణ్యమైన డైరీ, క్యాలెండర్‌ను సంవత్సర ప్రారంభంలోనే విడుదల చేయడం అభినందనీయమని TCGOA కమిటీ సభ్యులను ప్రశంసించారు. సహకార రంగం బలోపేతానికి ఉద్యోగుల కృషి అమూల్యమని పేర్కొన్న ప్రభుత్వం తీసుకొచ్చే నూతన విధానాలకు అనుగుణంగా ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. సమయపాలన, బాధ్యతాయుతమైన విధుల నిర్వహణ ద్వారా రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ప్రమోషన్ల సమస్యపై సానుకూల స్పందన**

సహకార శాఖలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పదోన్నతుల సమస్యపై మంత్రి సానుకూలంగా స్పందించారు. దిగువ స్థాయి ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియను వేగవంతం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఉద్యోగుల పనితీరు మెరుగుపడాలి – కమిషనర్**

గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రటరీ, సహకార సంఘాల కమిషనర్ కె. సురేందర్ మోహన్, ఐఏఎస్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఉద్యోగ వర్గాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు శాఖ పరంగా నిరంతర కృషి చేస్తామని తెలిపారు. అడిషనల్ రిజిస్ట్రార్ / OSD చంద్రమోహన్ రెడ్డి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రమోషన్లు, అలవెన్సులపై మంత్రి దృష్టికి TCGOA**

TCGOA రాష్ట్ర అధ్యక్షులు ఎ. జగన్మోహన్ రావు మాట్లాడుతూ, సహకార శాఖ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలు, సంస్థలు, ఫెడరేషన్లకు చట్టపరమైన మార్గనిర్దేశం చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయి ఫీల్డ్ ఉద్యోగులకు ఎన్నో సంవత్సరాలుగా TAలు రావడం లేదని, ఇతర శాఖల మాదిరిగా సహకార శాఖ అధికారులకు కార్ అలవెన్సులు లేవని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అదనపు రిజిస్ట్రార్ నుంచి డీసీఓ వరకు కార్ అలవెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 'రైజింగ్ కోఆపరేటివ్ తెలంగాణ - 2047' లక్ష్యంగా తీసుకోవాల్సిన సంస్కరణలపై వివరించారు.*

**24 ఏళ్లుగా ప్రమోషన్లు లేక నిరాశ – జనరల్ సెక్రటరీ.**





సంఘం జనరల్ సెక్రటరీ డా. డి. భీంరాజ్ మాట్లాడుతూ, గత 24 ఏళ్లుగా AR నుంచి DR స్థాయికి ప్రమోషన్లు లేకుండా ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు. రిజర్వేషన్ కేటగిరీలకు చెందిన ఉద్యోగులకు కూడా పదోన్నతులు 24 సంవత్సరాలుగా రాకపోవడం బాధాకరమన్నారు. డిపార్టుమెంటులో 1995 బ్యాచ్ ఉద్యోగులకు మాత్రమే ప్రమోషన్లు జరిగాయని, కింది స్థాయి ఉద్యోగులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలోనే అత్యంత అనుభవజ్ఞులైన మంత్రి గత సంవత్సరమే ప్రమోషన్ల ఫైలు ఇప్పుడే తెప్పించండి సంతకం చేస్తాను అని హామీ ఇచ్చారు. కానీ దేవుడు కరుణిస్తే పూజారి మాత్రం దయడలచడం లేదన్నట్టు జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇప్పుడు అదే దేవుడు ఇచ్చిన కోరికలు నెరవేర్చడానికి మన దగ్గరకే వచ్చారాని అన్నారు. ఇంత అనుభవజ్ఞులైన మంత్రి మన సహకార శాఖకు ఉండటం వల్ల తప్పకుండా న్యాయం జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర సంఘాల మద్దతు.

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (TGO) రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ, సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చలు కొనసాగిస్తామని తెలిపారు. మాజీ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, TNGO సిటీ యూనిట్ అధ్యక్షులు శ్రీరామ్, సహకార శాఖ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కార్యదర్శి రాజవర్ధన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల DCGOA అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, నాన్‌గెజిటెడ్ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.



## జీతాలు మింగి కార్మికులను నలిపేస్తున్న NCC, KSR – షాబాద్‌లో భగీరథ కార్మికుల పోరాట గర్జన

**షాబాద్ డిసెంబర్ 31(ప్రజాస్వరం):**

మిషన్ భగీరథ కార్మికుల చెమటకు విలువ లేకుండా మూడు నెలలుగా జీతాలు చెల్లించకుండా NCC, KSR కాంట్రాక్టర్లు కార్మికులను నిత్యం నలిపేస్తున్నారని సీఐటీయూ తీవ్రంగా మండిపడింది. ఈ దోపిడీకి వ్యతిరేకంగా షాబాద్ మండల పరిధిలోని అంతారం మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రం (40 ఎమ్ఎల్‌డీ) వద్ద కార్మికులు రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ గర్జిస్తూ మాట్లాడుతూ, "కార్మికుల చెమటను దోచుకుని నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం నేరం. జీతాలు అడిగితే కాలయాపన, మోసపూరిత హామీలే తప్ప చెల్లింపులు లేవు" అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతారం కేంద్రంలో 28 మంది కార్మికులు అవసరం ఉన్నప్పటికీ, కేవలం 15 మందితోనే పనులు చేయిస్తూ మానవీయతను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఒకవైపు జీతాలు లేవు, మరోవైపు అధిక పని భారం మోపుతూ కార్మికులను పీల్చిపిప్పి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్మిక శాఖ అధికారులు తక్షణమే స్పందించి, జీతాలు చెల్లించని NCC, KSR కాంట్రాక్టర్ల లేబర్ లైసెన్సులను రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. లేకపోతే ఈ పోరాటాన్ని జిల్లా స్థాయికి విస్తరించి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ఈ ఆందోళన కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్మిక దోపిడీకి వ్యతిరేకంగా నినాదాలతో ప్రాంతాన్ని దద్దరిల్లజేశారు.

## వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో ప్రైవేట్ పాఠశాల సందర్శనపై చర్చ

**మక్తల్ ప్రతినిధి డిసెంబర్ 31( ప్రజాస్వరం)**

వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలను జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని ఇటీవల సందర్శించడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా విద్యాధికారి ప్రభుత్వ పాఠశాలలు, ఎంఈఓ కార్యాలయాలు, లేదా విద్యా సంబంధిత తనిఖీలు చేపట్టకుండా కేవలం ఓ ప్రైవేట్ స్కూల్‌ను మాత్రమే సందర్శించి, ఆ పాఠశాలను అభినందించడం పలు అనుమానాలకు తావిస్తోంది. జిల్లా విద్యాధికారి ఎందుకు ప్రైవేట్ పాఠశాలను మాత్రమే సందర్శించారు? ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై ఎందుకు దృష్టి సారించలేదు? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సందర్శన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూడా ఎలాంటి అధికారిక నివేదిక లేదా వివరణ ఇవ్వకపోవడం విమర్శలకు దారి తీసింది. అదేవిధంగా స్థానిక ఎంఈఓ కూడా ఆ ప్రైవేట్ పాఠశాలను అభినందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ పాఠశాలలకు మాత్రమే ప్రోత్సాహం ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకొని, సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## కాప్రా సర్కిల్ లో యువతకు ఎల్‌జీ కంపెనీ ఉచిత శిక్షణ–ఉద్యోగ అవకాశాలు

**కుషాయిగూడ, డిసెంబర్ 31(ప్రజాస్వరం):**

ఉప్పల్ నియోజకవర్గంలో ఉద్యోగాలు లేని యువతీ యువకులకు ఎల్.జి. కంపెనీ ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోందని ఎల్.జి. కంపెనీ సెంట్రల్ మేనేజర్ సంగ్రం కిశోర్ తెలిపారు. మంగళవారం కమలానగర్‌లోని ఎల్.జి. ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్.జి. హోప్ టెక్నికల్ - ఎన్.ఎస్.ఐ.సి. ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసినవారితో పాటు అంతకన్నా ఎక్కువ చదివిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు గల యువతకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నామని, కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ ఆమోదించిన సర్టిఫికేట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ముఖ్యంగా పేద విద్యార్థులు, నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం 9908625756, 8074368668, 8130438200 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్ మేనేజర్ డి. రాఘవేంద్ర నాయక్ పిలుపునిచ్చారు.



## విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు పట్టాభిరామ్ ను అభినందించిన అక్కరమాని.

**విశాఖ పట్నం, డిసెంబర్ 31(ప్రజాస్వరం):**

విశాఖపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షునిగా ఎన్నికైన చోడే వెంకట పట్టాభిరాంను బుధవారం రాష్ట్ర బీసీ సంఘం నాయకులు, టీడీపీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకట్రావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అతనికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పార్టీని మరింత బలోపేతం చేయడంలో చోడే పట్టాభిరామ్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను విజయ తీరాలకు చేర్చడంలో పట్టాభిరామ్ గట్టిగా కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ అందరి సహకారంతో టీడీపీ పటిష్టానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా నన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు బొట్టా వెంకట రమణ, తెలుగుదేశం జోనల్ మీడియా కన్వీనర్ బైరెడ్డి పోతనరెడ్డి, జీవీఎంసీ 17వ వార్డు టీడీపీ యువ నాయకుడు చిన్నపిల్లి నరేంద్ర రెడ్డి, జనసేన నాయకుడు గరికిన వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి అంశాలపై జడ్సీ దృష్టికి తీసుకెళ్లిన కార్పొరేటర్లు

**కాప్రా డిసెంబర్ 31(ప్రజాస్వరం):**



ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రాధిక గుప్తాను ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉప్పల్ జోనల్ కార్యాలయంలో ఉప్పల్, చర్లపల్లి, కాప్రా కార్పొరేటర్లు మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవి, స్వర్ణరాజు కలిసి జోనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులను సమన్వయంతో వేగవంతం చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.




## పోగొట్టుకున్న ఫోన్లు భద్రం.. బాధితులకు అందజేసిన సిపి

**కరీంనగర్, డిసెంబర్ 31(ప్రజాస్వరం):**

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరి చేసి కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో బాధితులకు సిపి గౌస్ ఆలం, సీఐ ఏ, నిరంజన్ రెడ్డి అందజేశారు. రూ.18.20 లక్షల, 91 మొబైల్ ఫోన్లను బుధవారం బాధితులకు అప్పగించారు ఈ ఏడాది సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 2056 ఫోన్లను రికవరీ చేశామని సిపి గౌస్ అలం తెలిపారు ఫోన్లను ట్రేస్ చేయడంలో ప్రతిభను కనబరిచిన టెక్నికల్ టీమ్‌ను రివార్డులు ఇచ్చి అభినందించారు.

## మూలమల్ల చెరువు కట్టపై ముసలి కలకలం

- బిక్కుబిక్కుమంటున్న గ్రామస్తులు

**మక్తల్ ప్రతినిధి డిసెంబర్ 31(ప్రజా-స్వరం):**



వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలం, మూలమల్ల గ్రామ పరిధిలోని చిన్నకత్వ చెరువు కట్టపై ముసల్లు తిరుగుతూ గ్రామస్తుల్లో భయాందోళనను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో చెరువు కట్టపై ముసలి దర్శనమివ్వడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపర్లు, గొర్ల కాపర్లు ప్రయాణించేందుకు తీవ్ర భయంతో వెనుకాడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల డిమాండ్ చెరువు చుట్టూ బలమైన కంచె ఏర్పాటు చేయాలి ముసల్లు రోడ్డు పైకి రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. గ్రామ ప్రజల ప్రాణ భద్రతను నిర్ధారించాలి. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని మూలమల్ల గ్రామస్తులు కోరుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999